# ఈ కాలం నీతి



ఎమ్. సోమశేఖరాచార్యులు

సాయంత్రం ఐదున్నర

ఎట్టి పరిస్థితుల్లోనూ ఐదున్నర దాటితే నేను ఆఫీసులో వుండను. పంక్చువాల్టీ పాటించే మనిషిని. మా ఆఫీసర్ కూడా పంక్చువాల్టీ మనిషే! అందువల్ల ఆఫీసు స్టాఫంతా ఐదున్నర అవగానే బయటకు వచ్చేస్తారు.

నేను ఇంట్లో అడుగుపెట్టేసరికి పకోడి వాసన గుప్పుమని ముక్కుపుటాలకు సోకింది.

ఫైల్ టేబుల్ మీదపడేసి తిన్నగా వంటగదిలోనికి వెళ్ళాను.

శ్రీమతి పకోడీ వేయిస్తోంది. పనిచేస్తుండటం వల్ల శ్రీమతి జాకెట్టు వెనుకభాగం చెమటతో తడిసి పోయింది.

"ఏమిటీ ఈ రోజు స్పెషల్" శ్రీమతి దగ్గరకు వచ్చి అడిగాను.

"ఈరోజు మన పెళ్ళిరోజు" బోలెడుసిగ్గుపడిపోతూ చెప్పింది.

"ఈ రోజు మనపెళ్లిరోజా,? ఆవిషయం ప్రొద్దుటే ఎందుకు చెప్పలేదు" అడిగాను కాస్తకోపంగానే.

"మన పెళ్ళిరోజు కూడా మీకు గుర్తులేదా? మీ కింత మతిమరుపు అని తెలిస్తే ప్రొద్దుటేచెప్పేవుండేదాన్ని ఐనామిమ్మల్ని అనేం లాభం!? చెప్పక పోవడం నా బుద్ధి తక్కువ".

"సర్లే, అయిందేదో అయ్యింది. ఆ విషయం అంతటితో విడిచిపెట్టు. ఇప్పుడే బజార్లోకి వెళ్ళొస్తాను".

"కొద్దిగా పకోడి తినివెళ్ళండి".

"ఎంతసేపు ఓ పది నిమిషాలే కదా", అంటూ బయటకు వచ్చాను.

వంద రూపాయల చీరకొని శ్రీమతికిచ్చాను.

శ్రీమతి చిరుబురులాడటం తగ్గింది

ఆ రాత్రి హాయిగా గడిపేసాము

మర్నాడు ప్రొద్దుట నిద్రలేచేసరికి ఎదురింటి రామం శ్రీమతితో ఏదో మాట్లాడుతున్నాడు.

"రామూ! ఇంత ప్రొద్దుటవచ్చేవేం"? అడిగాను అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ.

"మీ ఆఫీసులో అటెండర్ పోస్టుఖాళీగా వుందని విన్నాను. మీరు రికమండేషన్ చేస్తే ఆఫీసర్‌గారు ఆ పోస్టు నాకిస్తారు" నమ్రతగా చేతులు కట్టుకునినిల్చుంటూ అన్నాడు.

"అటెండర్ పోస్టు ఖాళీగా వున్నమాట నిజమే ననుకో, కానీ ఆ పోస్టు నీకు రావాలంటే డబ్బు ఖర్చవుతుంది. అదినువ్వు భరించగలవా అని" రామం కళ్ళల్లోకి చూస్తూ అడిగాను.

"ఏ మాత్రం ఖర్చవుతుంది"?

"ఐదువందలు"

"ఐదువందలు రేపు తెస్తాను" రామం వెళ్ళబోయాడు.

రామాన్ని వారించి నేనులోనికి వెళ్ళి అప్లికేషన్ ఫారం తెచ్చిరామానికిస్తూ" ఈ అప్లికేషన్ ఫారం నింపి రేపు తీసుకునిరా" అన్నాను.

రామం అలాగే నంటూ అప్లికేషన్ ఫారం తీసుకుని వెళ్ళిపోయాడు.

రామం వెళ్ళగానే శ్రీమతి "ఏమిటీ, మీ ఆఫీసులో అటెండర్ పోస్టు ఖాళీగా వుందా? మా తమ్ముడు టెన్త్ ప్యాసయి ఖాళీగా వున్నాడు కదా, ఆ పోస్టు వాడికొచ్చేట్టు చూడండి" అంది.

"రామానికి మాటిచ్చి ఐదువందలు తెమ్మన్నాను. ఇప్పుడెలా"?

"మీరేం చేస్తారో నాకు తెలియదు. ఆ పోస్టు మాత్రం నా తమ్మునికే రావాలి" కోపంగా లోనికి నడిచింది శ్రీమతి.

కోపంగా లోనికివెళ్ళిన శ్రీమతిని చూసి చిన్నగా నవ్వుకున్నాను.

మర్నాడు రామం ఐదువందలు, నింపిన అప్లికేషన్ ఫారం నాకిచ్చి ఎలాగైనా తనకు ఆ ఉద్యోగం ఇప్పించమని ప్రాధేయపడ్డాడు.

"రామం! నీకేం భయంలేదు. ఆ పోస్ట్ నీకు రావటానికి నాశాయశక్తులా ప్రయత్నిస్తాను" ధైర్యం చెప్పాను.

పదిహేను రోజులు గడిచిపోయాయి.

ఆ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వస్తూ రామం ఇంటివైపు చూసాను. రామం ఆరు బయట వరండాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు.

"రామం, నాతోబాటు మా ఇంటికి రా నీతో మాట్లాడాలి" అన్నాను.

రామం నన్ను అనుసరిస్తూ నావెంట వచ్చాడు.

మా ఇద్దర్నీ చూసి శ్రీమతి రెండుకప్పులతో కాఫీలు తెచ్చి ఇచ్చింది.

"రామం, ముందు కాఫీ త్రాగు"

"సార్, పని అయ్యిందా"? ఖాళీకప్పు టేబుల్‌మీద పెడుతూ అన్నాడు రామం.

"నీకు ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు"

"మీ ప్రయత్నం సక్సెస్ కాలేదా" అతనిలో నిరాశ

"సారీరామం! నీగురించి ఎంతగానో ప్రయత్నించాను. కానీ ఏమీ లాభం లేకపోయింది. ఆ అటెండర్ పోస్టునీకే ఇస్తానని ఆఫీసర్ ప్రామిస్ చేయడంతో నువ్విచ్చిన ఐదు వందలు ఆఫీసర్‌కి ఇచ్చేసాను. కానీ ఇంటర్‌వ్యూ పంపే సమయానికి ఎం.ఎల్.ఏ పరాంకుశం మా ఆఫీసర్‌కి ఫోనుచేసి ఆ అటెండర్ పోస్టులో అతని కేండిడేట్‌ని ఎపాయింట్ చేయమన్నాడు. అందుకే మా ఆఫీసర్ ఎవ్వరికీ ఇంటర్ వ్యూలైనా పంపకుండా పరాంకుశం కేండిడేట్‌ని ఆ పోస్టులో ఎపాయింట్ చేసేసాడు. అందుకే నీకు కనీసం ఇంటర్‌వ్యూఐనా రాలేదు" వివరించాను.

"మీ ప్రయత్నం మీరు చేసారు. నారాత అలావుంది ఏం చేస్తాం"? అని వెళ్ళిపోయాడు రామం.

"మీరెంత ప్రయత్నించినా రామంకి రాలేదంటే నిజంగా అతనుదురదృష్టవంతుడే" అంది శ్రీమతి.

"నేను రామం గురించి ప్రయత్నిస్తే కదా, అతనికి రావటానికి"

"ఐతే మీరు రామంగురించి ప్రయత్నమే చేయలేదా?"

"ఊహూ"...

"మరి అతని దగ్గరనుండి ఐదు వందలు ఎందుకు తీసుకున్నారు"?

"అటెండర్ పోస్టులో నీ తమ్ముడ్ని ఎపాయింట్ చేయాలంటే ఐదువందలు ఖర్చవుతుంది. అందుకే ఆ ఐదువందలు రామందగ్గర వసూలుచేసి ప్రయత్నించాను. ఏమైతేనేం నా ప్రయత్నం వృధా కాలేదు"

"రామానికి ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపించి ఐదువందలు తీసుకుని ప్రయత్నించక పోవడం అన్యాయం కదా"

"అన్యాయమనుకుంటే ఈ కాలంలో బ్రతకలేము. ఎదుటి వారిని మోసంచేసి మనపనులు నెరవేర్చుకోవటమే ఈ కాలంనీతి, మీ తమ్ముడ్ని రమ్మని టెలిగ్రాఫ్ ఇవ్వాలి"

"నా తమ్ముడ్ని ఎందుకు రమ్మనటం"?

"ఎందుకేమిటి? ఆ అటెండర్ పోస్టు నీ తమ్మునికే వచ్చింది కనుక. ఇదిగో ఎపాయింట్‌మెంట్ ఆర్డర్. జాగ్రత్తచేయి" అని ఎపాయింట్‌మెంట్ ఆర్డర్ శ్రీమతికిచ్చి టెలిగ్రాఫ్ ఆఫీసువైపు నడిచాను.

---

### తల ఊపుడు

డ్రైవింగ్ సరిగా రాకుండానే లైసెన్స్ కోసం వచ్చిన ఒక వ్యక్తితో ఆ ఆర్టీవో ఆఫీసర్ ఇలా అడిగాడు- "చూడు బాబు, సిగ్నల్ లైట్ పనిచెయ్యక పోతే ఏం చేస్తావ్".

"చేయి ఊపుతానండీ" అన్నాడతను.

"మరి హెడ్ లైట్ పనిచెయ్యకపోతే"?

"తల ఊపుతా" వెంటనే జవాబిచ్చాడతను

— అదుసుమల్లి ప్రభాకర్